క్లుప్తంగా

కృష్ణాష్టమికి సిద్ధం


గోపిక అలంకరణలో చిన్నారి ధృతి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉట్టి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: యానంబైల్ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా కిన్నెరసాని, రాజాపురం, యానంబైల్, పునుకుల, పుల్లాయిగూడెం, కోడిపుంజుల వాగు, మొండికట్ట, రెడ్డిగూడెం, ఉల్వనూరు గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బోడు మండలం ప్రకటించాలి

టేకులపల్లి: దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న బోడుని మండలంగా ప్రకటించాలని బోడు యూత్ కల్తి చంద్రశేఖర్, మాడె చంద్రశేఖర్, మేకల సతీష్, ఎట్టి ప్రశాంత్, నల్లబోతుల సతీష్ తదితరులు కోరారు. శుక్రవారం బోడు పర్యటనకు వచ్చిన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. అభివృద్ధికి నోచుకోని బోడు, పరిసర ప్రాంత ప్రజలు తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ, ఆరోగ్యం కోసం ప్రభుత్వాస్పత్రి తదితర సేవల కోసం టేకులపల్లికి దూరాభారంతో వెళ్లాల్సి వస్తోందన్నారు. బోడు పరిసర ప్రాంతాలు పూర్తిగా ఆదివాసీ గిరిజనులు నివసించే 12 గ్రామపంచాయతీల ప్రజల అభిప్రాయం మేరకు బోడుని మండలంగా ఏర్పాటు చేయాలి కోరారు.

అమృత్ సరోవర్ వేడుక


సాయమ్మ చెరువు కట్టపై ఈత మొక్క నాటుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

టేకులపల్లి: చెరువు గట్లపై మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని టేకులపల్లి ఎంపీడీఓ బైరు మల్లీశ్వరి పిలుపునిచ్చారు. ఈ మేరకు అమృత్ సరోవర్ పథకంలో భాగంగా శుక్రవారం టేకులపల్లి మండలం గొల్లపల్లి, కోయగూడెం, ప్రెగళ్లపాడు గ్రామ పంచాయతీలలోని చెరువులను సందర్శించారు. చెరువు కట్టలపై ఈత, పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జేఎల్ గణేష్ గాంధీ, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు కృష్ణ చైతన్య, సతీష్, వసంతరావు, టీఏలు స్వప్న, భీముడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

జూలూరుపాడు: గుండెపుడి గ్రామానికి చెందిన పుచ్చకాయల కల్లూరమ్మ ఇటీవల మృతి చెందారు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు దుద్దుకూరి సుమంత్, మిత్రులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కల్లూరమ్మ కుటుంబసభ్యులకు క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాకర్లరు వెంకటేశ్వరరావు, కొమ్మినేని కృష్ణమూర్తి, కల్యాణపు నరేష్, తూము కోటయ్య, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, గాదె కృష్ణయ్య, కంచర్ల హరీష్, వేల్పుల గోపాలకృష్ణ, మద్దెబోయిన నాగరాజు, ఆనగంటి ధనమయ్య, వేల్పుల శివరామకృష్ణ, పుచ్చకాయల కొండరావు, రాంబాబు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు


అలుగు పోస్తున్న చల్లసముద్రం పెద్దచెరువు

ఇల్లెందురూరల్: చల్లసముద్రం పెద్దచెరువు అలుగుపోసింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు లచ్చగూడెం చెరువు అలుగు నుంచి వరద రావడంతో చల్లసముదరం పెద్ద చెరువు నీటి మట్టం శుక్రవారం మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో నిండింది. పది రోజుల క్రితం సగం కూడా నిండని పెద్దచెరువు దుస్థితిని చూసి కలత చెందిన రైతులు వరి నారు ముదురుతున్నా ఆశగా ఆకాశం వైపు ఎదురు చూశారు. వరణుడు కరుణించడంతో వరినాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

బోసిపోయిన పోస్టాఫీసు

టేకులపల్లి: 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, సంస్థల్లో బాధ్యతగా శుక్రవారం వేడుక నిర్వహించి జాతీయ జెండాను ఎగురవేశారు. కానీ టేకులపల్లి పోస్టాఫీసు వద్ద జాతీయ ఎగురవేయలేదు. అసలు తాళమే తీయలేదు. ఈ విషయమై పోస్టల్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా.. టేకులపల్లికి రాలేదని, కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నానని చెప్పారు.

మా తుఝే సలామ్

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పట్టణం, గ్రామ పంచాయతీలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు, కేటీపీఎస్, సింగరేణిలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. కొత్తగూడెం మున్సిపల్ ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన వైద్య, ఐసీడీఎస్, వ్యవసాయ, మత్స్య, అగ్నిమాపక, విద్యా వైజ్ఞానిక, ఉపాధి శాఖలతో పాటు వివిధ శాఖల స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వక్తలు మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితం వల్లే దేశానికి స్వాతంత్య్రం లభించిందన్నారు. వేడుకల్లో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


సింగరేణి(కొత్తగూడెం): జాతీయ జెండా ఎగురవేస్తున్న సింగరేణి జీఎం శాలేంరాజు


ఇల్లెందు: జెండాకు వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య


సూపర్‌బజార్(కొత్తగూడెం): క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యే కూనంనేని


పాల్వంచరూరల్: సీతారామ ప్రాజెక్టు కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ


పాల్వంచ: కేటీపీఎస్‌లో మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు


పాల్వంచ: మున్సిపాలిటీలో కమిషనర్ సుజాత


జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో..


కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగా పాఠశాలలో...


కొత్తగూడెం ఫుడ్‌కోర్ట్ వద్ద..


కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..


జూలూరుపాడు: సెయింట్ ఆంటోనియస్ స్కూల్‌లో


చుంచుపల్లి: టీజీఎఫ్‌డీసీ కార్యాలయంలో..


సుజాతనగర్: తహసీల్దార్ కార్యాలయంలో..


ఇల్లెందు: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దిండిగల రాజేందర్, నాయకులు


టేకులపల్లి బీఆర్ఎస్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే హరిప్రియ


టేకులపల్లి బైతుల్లా మసీదులో..


ఇల్లెందు: సింగరేణిలో.. జీఎం కృష్ణయ్య


ఇల్లెందురూరల్: సీతానగరంలో..


సుజాతనగర్: నాయకుల వేషధారణలో శ్రీవాణి నికేతన్ స్కూల్ విద్యార్థులు


కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు


కొత్తగూడెంటౌన్: ప్రగతి మైదానంలో చిన్నారుల నృత్య ప్రదర్శన


టేకులపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో..


చుంచుపల్లి: రుద్రంపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి


పాల్వంచరూరల్: శిశుమందిర్ పాఠశాలలో..


కొత్తగూడెంలో భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ


ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి వద్ద డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు

ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): గణేష్ టెంపుల్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు, పెద్దమ్మగుడి ఆధ్వర్యంలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుందామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దేవస్థానాలు రూపొందించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓల ద్వారా ఆహ్వాన పత్రికలను అందుకున్నారు. మాట్లాడుతూ దేవాలయ అధికారులు, పాలకవర్గం, అర్చకులు సమష్టి నిర్ణయాలతో ఉత్సవాలను విజయవంతం చేయాలని, తాను సహకరిస్తానన్నారు. ఎస్‌కే సాబీర్‌పాషా, ఈఓ రజని, పెద్దమ్మగుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, అర్చకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

అమ్మవారి ఆలయంలో..

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో వచ్చే నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవములు జరగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

యూరియా కొరతపై దర్యాప్తు జరిపించండి..

కొత్తగూడెంఅర్బన్: యూరియా కొరతపై దర్యాప్తు చేయించాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సరిపడా యూరియా సరఫరా చేస్తున్నామని చెబుతుంటే కొరతకు కారణాలేంటో ప్రభుత్వం ఆరా తీయాలన్నారు. కొంతమంది సహకార సంఘాల నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉంటూ దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని రైతులకు అందించాల్సిన యూరియాను అక్రమంగా వ్యాపారులకు అమ్ముకుంటున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, సొసైటీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల రోజురోజుకు ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. బొమ్మెర వరప్రసాద్, బోడ బాలునాయక్, అప్పారావు, భూక్యా బాలకృష్ణ, బానోతు రామ, శివకృష్ణ పాల్గొన్నారు.

పోడుభూముల్లోనూ కొబ్బరి, బొప్పాయి

- కూరగాయల సాగులో ఆశించిన దిగుబడులు
- ప్రోత్సహిస్తే మరిన్ని రకాలకు రైతుల ఆసక్తి


కొమరారంలో బొప్పాయి తోట


రాఘబోయిగూడెంలో కొబ్బరి తోట

ఇల్లెందురూరల్: ఏజెన్సీ గ్రామాలలో మొక్కజొన్న, పత్తి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు కూరగాయల సాగుతోపాటు బొప్పాయి, మునగ పంటలను సైతం సాగు చేస్తున్నారు. కొమరారం కేంద్రంగా వందల ఎకరాల్లో కూరగాయల సాగు రెండు దశాబ్దాలుగా కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం రాఘబోయినగూడెంలో ప్రారంభమైన బొప్పాయి సాగు క్రమంగా మండలంలో ఇతర గ్రామాలను విస్తరించింది. కలెక్టర్ స్వయంగా ప్రోత్సహించడంతో పలు గ్రామాలలో మునగ సాగు విస్తీర్ణం కూడా పెరుగుతూ వస్తోంది.

తొలిసారిగా కొబ్బరి సాగు...

కొబ్బరి బోండాలంటే మనకు గుర్తుకొచ్చేది కోనసీమ, కేరళ, చెన్నై తదితర ప్రాంతాలు. అయితే మన నేలలు కూడా కొబ్బరి సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఈ విషయాన్ని గ్రహించిన మండలంలోని రాఘబోయినగూడెం గ్రామానికి చెందిన రైతు కల్లోజి రాంబాబు తన పోడు భూమిలో మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేసేవాడు. శ్రమ అధికంగా ఉన్నా ఆశించిన లాభాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మార్కెట్ డిమాండ్ ఉన్న కొబ్బరి సాగుపై దృష్టి సారించాడు. ప్రైవేటు నర్సరీలను ఆశ్రయించి కొబ్బరిసాగుపై అవగాహన పెంచుకున్నాడు. వారి వద్దే మొక్కలు కొనుగోలు చేసి మూడు ఎకరాలలో ప్రయోగాత్మకంగా సాగు ప్రారంభించాడు.

ధరలపై ప్రభావం

ఆరోగ్యం కోసం రోజూ కొబ్బరినీళ్లు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. కానీ కొబ్బరి బోండాలను మనం రాజమండ్రి కేరళ, చెన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటాం. కూరగాయల దిగుబడి జిల్లా అవసరాలకు సరిపడా స్థానికంగా లేకపోవడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. స్థానికంగా పండేందుకు నేలలు అనువుగా ఉన్నా ఉద్యానశాఖ ప్రోత్సాహం కొరవడి బొప్పాయి, సపోట, సీతాఫలం వంటి ఫలాలను కూడా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఆయా ఉత్పత్తులను అందించే పంటలను మన నేలల్లోనే సాగు చేస్తే స్థానికంగా లభించడం ద్వారా రవాణా భారం తగ్గి వినియోగదారులకు కూడా తక్కువ రేటుకే లభిస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

సోలార్‌తో రక్షణ.. డ్రిప్‌తో నీరు..

ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా కోతల బెడద తీవ్రంగా కనిపిస్తుంది. వాటి బారి నుంచి పంటలను కాపాడుకోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం నుంచి రాయితీలు అందకున్నా రైతులు తమ సొంత ఖర్చులతో తోటల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకొని పంటలను కాపాడుకుంటున్నారు. కోతులు రాకపోవడంతో అంతరపంటలు కూడా ఆశించిన దిగుబడులను అందిస్తున్నాయి. చాలా మంది రైతులు సొంతంగా డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకుని నిరంతర నీటి సరఫరాతో ప్రయోజనం పొందుతున్నారు.

కొరవడిన ప్రోత్సాహం...

కొబ్బరి, బొప్పాయి, మునగ, కూరగాయల సాగు వైపు రైతుల ఆసక్తి చూపుతున్నా ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం కొరవడింది. సబ్సిడీలు ఇస్తామని ప్రకటనలు వెలువడుతన్నా అవి అయిల్‌పాం మినహా ఇతర పంటల దరి చేరడం లేదు. ఈ కారణంగా ఏజెన్సీలోనూ విద్యావంతులైన, ఆర్థికంగా ఉన్న రైతులు మాత్రమే నూతన ఒరవడిలో పంటలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీలు అందించి ప్రోత్సహిస్తే మరిన్ని వెరైటీలను సాగు చేసేందుకు ఏజెన్సీ రైతులు సుముఖంగా ఉన్నారు.

కొబ్బరి తోట బాగుంది...



మొక్కజొన్న, పత్తి పంటలతో ఆశించిన లాభాలు రావడం లేదు. దీంతో అధిక ధర పలుకుతున్న కొబ్బరి సాగు చేయాలని అనుకున్నాను. ప్రైవేటు నర్సరీలను ఆశ్రయించి అవగాహన పెంచుకొని మూడు ఎకరాల్లో సాగు ప్రారంభించాను. ఈ ఏడాదే గెలలు వస్తున్నాయి.

– కల్లోజి రాంబాబు, రైతు, రాఘబోయినగూడెం

బొప్పాయితో మంచి లాభాలు...



పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగు చేశాను. ఆశించిన ఫలితాలనివ్వలేదు. కూరగాయలు సాగు చేశాను. కానీ మార్కెట్ సౌకర్యం లేక ఆశించిన లాభాలు రాలేదు. బొప్పాయితో మంచి లాభాలు వస్తున్నాయని తెలుసుకొని తొలిసారిగా సాగు చేపట్టాను.

– బానోత్ సంతు, రైతు, బోయితండా